AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

WWW.AKSHARATODAY.IN

26-2-2026 (Thursday) | MAIN EDITION

## తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం.. ఒకరి మృతి




**అక్షరటుడే, తిరుమల:** తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం చోటు చేసుకుంది. ఓ బైక్ అదుపు తప్పి కిందపడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. తమిళనాడుకు చెందిన ఇద్దరు రైడర్లు బైక్‌పై తిరుమల వచ్చారు. ఈ క్రమంలో తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో ప్రమాదం చోటు చేసుకుంది. బారికేడ్ ను ఢీకొట్టి రోడ్డు అవతల వారు పడిపోయారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరో భక్తుడికి తీవ్ర గాయాలయ్యాయి. 30వ మలుపు దగ్గర ప్రమాదం చోటు చేసుకుంది. మృతుడిని తమిళనాడుకు చెందిన నటరాజన్‌గా గుర్తించారు. గాయపడ్డ వ్యక్తిని తిరుపతి స్విమ్స్‌కు తరలించారు.

## హోలీకి ప్రత్యేక రైళ్లు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రైల్వే శాఖ ప్రయాణికులకు గుడ్ న్యూస్ చెప్పింది. హోలీ పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ మేరకు ప్రత్యేక రైళ్లు నడుపుతామని ప్రకటించింది. దేశవ్యాప్తంగా 1,244 స్పెషల్ ట్రైన్లు వేస్తామని పేర్కొంది. ఈనెల 25 నుంచి మార్చి 18 వరకు వివిధ జోన్‌లలో 1,244 ప్రత్యేక ట్రిప్పులు వేస్తామని తెలిపింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 16 ప్రత్యేక రైళ్లు 40 ట్రిప్పులు నడవనున్నాయి. చర్లపల్లి, తిరుపతి, సికింద్రాబాద్, చంద్రపూర్ నుంచి ఉత్తర, తూర్పు, ఈశాన్య రాష్ట్రాలకు ఈ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి.

## నల్లమల సాగర్‌తో నష్టంలేదు..



**అక్షరటుడే, అమరావతి :** పోలవరం-నల్లమల సాగర్‌తో ఎవరికీ నష్టంలేదని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. అసెంబ్లీలో రాయలసీమ ప్రాజెక్టుపై గురువారం చర్చించారు. సముద్రంలోకి వెళ్లే నీటినే ఉపయోగించుకుంటామని చెప్పారు. కాళేశ్వరం గోదావరిపైనే కట్టారని, తాము అభ్యంతరం చెప్పలేదన్నారు.

## బాధితులకు అండగా ఉంటాం



**అక్షరటుడే, హైదరాబాద్:** నగరంలోని లంగర్‌హౌస్‌లో గల మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్స్ వాసులను బీజేపీ నాయకులు పరామర్శించారు. గాంధీ విగ్రహ ఏర్పాటు కోసం అపార్ట్‌మెంట్‌ను ఖాళీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లా డుతూ.. మధ్య తరగతి ప్రజలను రోడ్డున పడేయాలని చూడడం నిరంకుశత్వమన్నారు.

## వెలుగుమట్లలో కేటీఆర్ పర్యటన



**అక్షరటుడే, ఖమ్మం:** ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో గురువారం కేటీఆర్ పర్యటించారు. అక్కడ పేదల నివాసాలను అధికారులు కూల్చి వేసిన విషయం తెలిసిందే. దీంతో వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. భూదాన్ భూ బాధితులను కేటీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.



## ఈడీ విచారణకు హాజరైన అనిల్ అంబానీ

**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీ మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఈడీ ముందు హాజరయ్యారు. రిలయన్స్ కమ్యూనికేషన్స్‌తో ముడిపడి ఉన్న బ్యాంకు రుణ మోసం కేసులో 66 ఏళ్ల వ్యాపార దిగ్గజం రెండో సారి విచారణకు వచ్చారు. రూ.40 వేల కోట్ల విలువైన బ్యాంకు మోసం చుట్టూ తిరుగుతున్న మనీలాండరింగ్ కేసులో వ్యాపారవేత్త అనిల్ అంబానీ గురువారం ఉదయం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ముందు హాజరయ్యారు.



## ఐపీఎస్ అధికారిపై లుకౌట్ నోటీసులు

**అక్షరటుడే, ఏపీ:** ఐపీఎస్ అధికారి సునీల్‌నాయక్‌పై ఏపీ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. వైసీపీ హయాంలో అప్పటి ఎంపీ, ప్రస్తుతం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును చిత్రహింసలకు గురి చేసిన విషయంలో ఆయనపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఐపీఎస్ సునీల్ నాయక్ విదేశాలకు పారిపోకుండా పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. బీహార్ కేడర్‌కు చెందిన సునీల్ నాయక్ వైసీపీ హయాంలో ఏపీకి డిప్యుటేషన్‌పై వచ్చారు. అయితే నాటి ఎంపీ రఘురామకృష్ణంరాజు, కస్టడీలో ఆయనను చిత్రహింసలు పెట్టారని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో సునీల్ నాయక్ కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం.




**రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. మొత్తం 45 మందిని ప్రభుత్వం ట్రాన్స్‌ఫర్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కసారిగా భారీ మొత్తంలో ఐఏఎస్ అధికారులను బదిలీ చేయడం గమనార్హం. ఇందులో పలు శాఖల కార్యదర్శులతో పాటు కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు సైతం ఉన్నారు.** —అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# ఐఏఎస్‌ల బదిలీ

- 45 మందిని ట్రాన్స్‌ఫర్ చేసిన ప్రభుత్వం
- పలు జిల్లాల కలెక్టర్లకు స్థానచలనం

ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా పరిశ్రమలు, ఐటీ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సంజయ్ కుమార్‌ను పీఆర్ & ఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీగా బదిలీ చేశారు. సబ్యసాచి ఘోష్‌కు ఫ్లాగ్‌షిప్ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ స్కీమ్స్ యూనిట్‌తో పాటు CSR బాధ్యతలు అప్పగించారు. లేబర్, ఎంప్లాయ్‌మెంట్, ట్రైనింగ్, ఫ్యాక్టరీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీగా కొనసాగుతున్న దాన కిషోర్‌కు విపత్తు నిర్వహణ శాఖకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీగా శ్రీధర్, రాహుల్ బొజ్జ జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలో రాజకీయ వ్యవహారాల ప్రిన్సిపల్ సెక్రెటరీగా బదిలీ అయ్యారు. ఆయనకు బీసీ వెల్ఫేర్ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఇరిగేషన్, సీఏడీ కార్యదర్శిగా ఈ శ్రీధర్, ఫైనాన్స్ ప్లానింగ్ కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్, మహబూబ్ కలెక్టర్ బీ విజేంద్ర తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. డి దివ్యకు ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ మూడో డిస్కమ్ సీఎండీగా, భవేశ్ మిశ్రా ఐటీ శాఖలో స్పెషల్ సెక్రెటరీగా నియమితులయ్యారు.

### పలువురు కలెక్టర్లు సైతం

మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తెలంగాణ భవన్ (ఢిల్లీ)లో సమన్వయ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా, యాదాద్రి భువనగిరి కలెక్టర్ ఎం హనుమంత రావు ఎండోమెంట్స్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. నారాయణ పేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఫైనాన్స్ శాఖ స్పెషల్ సెక్రెటరీగా, జనగామ కలెక్టర్ సందీప్‌కుమార్ జా జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌గా ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కరీంనగర్ కలెక్టర్ పమీల సత్పతి కార్మిక శాఖ స్పెషల్ కమిషనర్‌గా, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా నియామకం అయ్యారు. మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ సహకార శాఖ స్పెషల్ కమిషనర్, రిజిస్ట్రార్‌గా, జనగాం కలెక్టర్ రిజ్వానాబాషా షేక్ గద్వాలకు బదిలీ అయ్యారు.

జితేష్ వి పాటిల్ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీగా, సంతోష్ బీఎం జోగులాంబ కలెక్టర్ నుంచి గిరిజన సంక్షేమ డైరెక్టర్‌గా, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ నారాయణపేటకు, హన్మకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ మహబూబాబాద్‌కు బదిలీ అయ్యారు. కాత్యాయని దేవి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, ఫణీంద్ర రెడ్డి, నారాయణపేట్ అదనపు కలెక్టర్‌గా, చిత్ర మిశ్రా కరీంనగర్ కలెక్టర్‌గా నియామకం అయ్యారు.


రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా గరిమా అగర్వాల్, వికారాబాద్ కలెక్టర్‌గా దీపక్ తివారి, మెదక్‌కు ప్రతీమా సింగ్, కొత్తగూడెం అంకిత్, హన్మకొండ చహత్ బాజ్‌పేయి, మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా ఖుష్బూ గుప్తా ట్రాన్స్‌ఫర్ అయ్యారు. రాజేంద్ర నగర్ జోనల్ కమిషనర్‌గా మంద మకరందు, హైదరాబాద్ మెట్రో జాయింట్ ఎండీగా శివేంద్ర ప్రతాప్, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌గా లలిత్‌కుమార్ నియామకం అయ్యారు.

## పెరగనున్న కొత్త వాహనాల రేట్లు



**అక్షరటుడే, హైదరాబాద్ :** వాహనదారులకు రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. కొత్తగా కొనుగోలు చేసే వాహనాలపై భద్రత పన్ను విధించనుంది. దీంతో ఆయా వాహనాల రేట్లు పెరగనున్నాయి. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్‌లో జీఎస్టీ సంస్కరణలు అమలు చేసిన విషయం తెలిసిందే. దీంతో వాహనాల రేట్లు భారీగా తగ్గాయి. పలు వాహనాలపై జీఎస్టీని 28 శాతం నుంచి 18శాతానికి తగ్గించడంతో రేట్లు దిగి వచ్చాయి. దీంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో రేట్లు పెరగనున్నాయి. కొత్త వాహనాలపై మార్చి 1 నుంచి రహదారి భద్రత పన్ను వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాహనాల రకాలను బట్టి ఈ పన్ను రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకు ఉండనుంది. ఇది వినియోగదారులపై పడనుంది. దీంతో రేట్లు పెరుగుతాయి. కొత్తగా విధించే ఈ పన్నుతో రూ.270 కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తుంది. ఈ మేరకు తెలంగాణ రవాణా శాఖ ఉత్తర్వులు జారీ ఏసింది. రోడ్డు భద్రతను మెరుగు పర్చడానికి ఈ పన్ను విధిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

## తెలంగాణలో భూకంపం




**అక్షరటుడే, మంచిర్యాల :** తెలంగాణలో స్వల్పంగా భూమి కంపించింది. మంచిర్యాల జిల్లాలో భూప్రకంపనలు చోటు చేసుకున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో భూకంపం చోటు చేసుకుంది. రిక్టర్ స్కేల్‌పై 3.9గా తీవ్రత నమోదైంది. మంచిర్యాలకు 35 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తీవ్రత తక్కువగా ఉండటంతో ఎలాంటి నష్టం జరగలేదు. అయితే అర్ధరాత్రి ప్రకంపనలు చోటు చేసుకోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో భూకంపాలు వస్తుంటాయని అధికారులు పేర్కొన్నారు.

## ఎన్‌సీఈఆర్‌టీపై సుప్రీంకోర్టు ఆగ్రహం..



**అక్షరటుడే, ఢిల్లీ:** ఎన్‌సీఈఆర్‌టీపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్‌సీఈఆర్‌టీ ముద్రించిన ఎనిమిదో తరగతి సోషల్ సైన్స్ పుస్తకాన్ని నిషేధించింది. సోషల్ పుస్తకంలో ఎన్‌సీఈఆర్‌టీ న్యాయవ్యవస్థలో అవినీతి గురించి ముద్రించింది. దీనిని సుమోటాగా స్వీకరించిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఆ పాఠ్యపుస్తకాన్ని పునర్ ముద్రించడం, డిజిటల్‌గా వ్యాప్తి చేయడాన్ని పూర్తిగా నిషేధించాలని ఆదేశించింది. ప్రస్తుతం చెలామణిలో ఉన్న పుస్తకాలను వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది.

## వివాహ బంధంలోకి విజయ్, రష్మిక



**విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో తక్కువ మంది అతిథుల మధ్య వీరి వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఉదయం 10:10 గంటలకు వీరి పెళ్లి జరిగినట్లు తెలిసింది. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పెళ్లికి హాజరు అయ్యారు. ఈ జంటకు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఎన్నో రోజులుగా ప్రేమ పక్షులుగా విహరిస్తున్న ఈ జంట తాజాగా పెళ్లి బంధంతో ఒక్కటైంది. హైదరాబాద్‌లో మార్చి 4న వీరి రిసెప్షన్ ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.**


—అక్షరటుడే, సినిమాడెస్క్

## బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు మావోల మృతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఛత్తీస్‌గఢ్ జిల్లా బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రావతి నది అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్ జిల్లాలోని ఇంద్రావతి నది ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారం బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ ఆపరేషన్ సందర్భంగా, భద్రతా దళాలకు, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగాయి. ఎన్‌కౌంటర్ తర్వాత ఆ ప్రాంతంలో ఇద్దరు యూనిఫాం ధరించిన మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయని బీజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ జితేంద్ర యాదవ్ తెలిపారు. భద్రతా సిబ్బంది సంఘటనా స్థలం నుంచి ఒక ఎస్‌ఎల్‌ఆర్ రైఫిల్, ఒక ఐఎన్‌ఎస్‌ఏఎస్ రైఫిల్, 12బోర్ రైఫిల్‌తో సహా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

## షాపింగ్‌మాల్‌లో అగ్ని ప్రమాదం



**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని ఓ షాపింగ్ మాల్‌లో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. జూబ్లీహిల్స్‌లో రోడ్ నెంబర్ 36లో భారీ అగ్నిప్రమాదం జరగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మెట్రో స్టేషన్ సమీపంలోని మంగళగౌరి షాపింగ్‌మాల్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అనంతరం మాల్ మొత్తం మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పుతున్నారు. ప్రస్తుతం షాప్ నడవడం లేదని అధికారులు తెలిపారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. మరమ్మతులు పనులు కొనసాగుతుండటంతో నలుగురు కార్మికులు లోపల చిక్కుకున్నారని, వారిని బ్యాక్ డోర్ ద్వారా బయటకు తీసుకొచ్చినట్లు తెలిపారు.